క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



నోట్‌బుక్స్ అందజేస్తున్న నాయకులు శ్రీరాములుయాదవ్, భిక్షపతిచారి

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ భిక్షపతిచారి జన్మదినం సందర్భంగా సిర్లాహిల్స్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం ఆయన నోట్‌బుక్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. అనంతరం భిక్షపతిచారి పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సోమేశ్‌కుమార్, గాజుల మధు, మాజీ కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, రవినాయక్, భీంరాజ్, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, విక్కీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న నాయకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ కోటమైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం కనుల పండువగా కొనసాగింది. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం 5.29 గంటలకు యంత్రస్థాపన, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, శాంతి పఠనం, జయాది హోమాలు, బలి ప్రదానం, పూర్ణాహుతి, కళాశోద్వాసన తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు సుక్క శివకుమార్, యాతం పవన్ కుమార్‌యాదవ్, నాయకులు నిమ్మల నరేందర్‌గౌడ్, ఈరంకి విశ్వనాథ్‌గౌడ్, గొండ్యాల దశరథముదిరాజ్, గుర్జని గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీగా అమ్మవారు

సైదాబాద్: అంగరంగ వైభవంగా జరిగే ఆషాఢ మాస అమ్మవారి బోనాల మహోత్సవాల సందర్భంగా శంకేశ్వరబజార్‌లోని శ్రీభవానీ శంకర మాతా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని ఆలయ కమిటీ ప్రతినిధి చిలుకూరు రామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకంబరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ మహేశ్

హస్తినాపురం: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాగర్‌కాంప్లెక్స్ ప్రాంతంలో వసీఐ తోట మహేశ్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నాకాబందీ నిర్వహించారు. వర్షం ప్రభావం లేని ప్రాంతాలను ఎంచుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ప్రజల సహకారంతో ఈ నాకాబందీ శాంతియుతంగా కొనసాగుతుందని, ప్రజల భద్రత కోసం అవసరమైతే రాబోయే రోజుల్లో ఇలాంటి తనిఖీలు కట్టుదిట్టంగా కొనసాగిస్తామని సీఐ తెలిపారు. 306 వాహనాలు తనిఖీ చేసి 25 వాహనాలకు రూ. 10 వేల జరిమానా విధించడం జరిగిందని , అనుమానిత వ్యక్తులను గుర్తించి వేలిముద్రలు సేకరించామన్నారు. తనిఖీల్లో క్రైమ్ సీఐ రాజేశ్, ఎస్సైలు, ఏఎస్సైలే, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

లింగోజిగూడ: సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లోని ఎస్బీహెచ్ నెంబర్-3లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని రోడ్డు నెంబర్ 1,2,3,4,5 లో సుమారు రూ.72 లక్షల వ్యయంతో సీసీ రోడ్ పనులు జరుగుతున్నాయి. రోడ్డు నెంబర్ 1,2 ఇప్పటికే పూర్తి కాగా, రోడ్ నెంబర్ 3, 4, 5 పనులు మరో రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయన్నారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలచందర్‌గౌడ్, వెంకటరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్, రామోజీ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

నాగోలు: డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి బండ్లగూడ వరకు రేడియల్ రోడ్డు ఇరువైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను శనివారం తొలగించారు. హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆక్రమణలను జేసీబీతో తొలగించారు.

రెండు కిలోమీటర్లు నడిస్తేనే పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రం లేక ఇబ్బంది పడుతున్న గర్భిణులు, బాలింతలు

- వ్యాక్సినేషన్లకు సైతం తప్పని ఇక్కట్లు
- వినతులిస్తున్నా పట్టించుకోని పాలకులు



అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సీడీపీఓను కోరుతున్న మహిళలు(ఫైల్)

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జెన్నాయిగూడ ఒక్కప్పటి రావిర్యాల గ్రామ పంచాయతీకి ఆవాస గ్రామం. ఈ గ్రామంలో సుమారు 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలో ఎటువంటి మౌలిక వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం అంగన్‌వాడీ కేంద్రం కూడా లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాలినడకే శరణ్యం

అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేందుకు జెన్నాయిగూడ నుంచి రావిర్యాలకు రెండు కిలోమీటర్ల దూరం. ఈ మార్గంలో బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలు కూడా నడవక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకోవాలన్నా.. చిన్నారులకు వ్యాక్సిన్‌లు వేయించాలన్నా కాలినడకే శరణ్యం. ఏళ్ల నుంచి స్థానికంగా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నా పట్టించుకునే వారే లేరు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఇటుగా కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అవార్డులతో విద్యార్థులు, మాజీ మేయర్ పారిజాత, నిర్వాహకులు

విద్యార్థులకు అచీవ్‌మెంట్ అవార్డులు

బడంగ్‌పేట్: మాస్టర్‌మైండ్ జూనియర్ కళాశాల బడంగ్‌పేట్‌లో శనివారం అకాడమిక్ అచీవ్‌మెంట్ అవార్డ్స్–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ చిగురింత పారిజాత విచ్చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పారిజాత చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్ని కష్టాలు ఎదురైనా శ్రద్ధతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవడంపై విద్యార్థులను అభినందించారు. స్ఫూర్తి కాలేజీలో బీ.కామ్, బీబీఏ కోర్సుల్లో ప్రవేశం పొందిన ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు మాస్టర్‌మైండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ పేరుతో ఫీజులు చెల్లించారు. ఐఐటీ ధన్‌బాగ్‌లో ప్రవేశం పొందిన ఇద్దరు విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. తండ్రి ఆటోడ్రైవర్ చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థికి మాజీ మేయర్ పారిజాత రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, సీఈవో హోళిధర్ రెడ్డి, కళాశాల చైర్మన్ డా.జగన్‌మోహన్‌రావు, సెక్రటరీ డా.పాండు, డైరెక్టర్లు నాగేంద్ర, లక్‌పతి, బాలాజీ, కామర్స్‌హెడ్ శ్రీధర్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్స్ నవనీత, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

కందుకూరు: మానవాళి మనుగడకు చెట్లు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌శర్మ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని నేదునూరు పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెట్లు ప్రగతికి మెట్లు అని, నాటిన ప్రతీ మొక్కను ఉపాధ్యాయులు, విద్యార్థులు కాపాడుకోవాలన్నారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలతో మొక్కలు నాటించడం ఓ అలవాటుగా చేయాలన్నారు. పర్యావరణాన్ని సమతుల్యం చేయడంలో మొక్కలు ఎంతో కీలకమన్నారు. వీలున్న చోట మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌మోహన్‌రెడ్డి, శాంతకుమారి, కౌసల్య, శ్రీవాణి, గోరిజా, కరుణాకర్, పీడీ అబ్దుల్లా, డాక్టర్ ఎండీ బషీర్, హసునోద్దీన్, శ్రీశైలం, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కేటీఆర్‌పై చర్యలకు ఫిర్యాదు



కేటీఆర్‌పై ఫిర్యాదు చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

షాబాద్: ఖమ్మం జిల్లాలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేటీఆర్‌పై పోలీస్‌స్టేషన్‌లో సీఐ కాంతారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి పేరుతో అప్పులు చేసిన రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తగిన రీతిలో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సంజీవరెడ్డి, నర్సింలుగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు తదితరులు ఉన్నారు.

చెరువులు, కుంటలను కాపాడుకుందాం

తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: రైతులకు ఉపయోగపడుతున్న చెరువు, కుంటలను కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ పరమేశ్వరచారి అన్నారు. శనివారం మండల పరిధిలోని బాకారం సమీపంలో ఎర్రకుంటను అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి ఎర్రకుంటకు గండిపడి పూర్తిస్థాయి నీరు దిగువన ప్రవహించాయి. నీరు లేక వెలవెలబోయిన ఎర్రకుంటను అధికారులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుంటలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నప్పుడే చుట్టు పక్కన ఉన్న రైతుల బోరుబావులు సంపూర్ణ నీటిని అందిస్తాయన్నారు. ప్రభుత్వం ద్వారా చెరువులు, కుంటలు కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలన్నారు. వెంటనే ఇరిగేషన్ ద్వారా చెరువుకు మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. ఎర్రకుంట ఎలాంటి కబ్జాకు గురైనా వారిపై చర్యలు తీసుకొని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కొత్తపల్లి రాఘవ రెడ్డి, నాయకులు నివాస్‌యాదవ్, తిరుపతిరెడ్డి, జీపీ సిబ్బంది నర్సింహ, జగన్ పాల్గొన్నారు.



ఎర్రకుంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డీఈ పరమేశ్వరచారి

ఘనంగా కాటమయ్య బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి ప్రెస్‌కాలనీలోని కంఠమేశ్వరస్వామి (కాటమయ్య) బోనాల ఉత్సవాలు మన్సూరాబాద్ గౌడ సహకార సంఘం అధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి హాజరై కంఠమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, నరేష్‌గౌడ్, సాయిదాస్‌గౌడ్, త్రిలోక్నాథ్‌గౌడ్, సునిల్‌గౌడ్, స్వాత్విక్‌గౌడ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐలో..

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లోని పెద్దమ్మగుడిలో జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జీఎస్ఐ డీడీజీ ఎల్‌పీసింగ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీడీజీలు సత్యనారాయణ్ మహాపాత్రో, డైరెక్టర్ హరమోహన్ మిశ్రా, బెనర్జీ, సైలేంద్రసింగ్, అసోసియేషన్ నేతలు ఆదర్శ మహేష్, తారకేశ్వర్‌రావు, సుధాకర్‌రావు,శేఖర్ పాల్గొన్నారు.

పోచమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయం నుంచి మన్సూరాబాద్ పోచమ్మదేవికి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. దుర్గాదేవి దేవాలయం నుంచి పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఫలహారంబండి ఊరేగింపుతో పట్టు వస్త్రాలను పోచమ్మతల్లికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, మురళీ, అజయ్, రమణమూర్తి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

మలక్‌పపేట: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 23న చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్‌ను శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో విడుదల చేశారు.నీ కార్యక్రమానికి పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్, ప్రధాన కార్యదర్శి గణేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సైదులు, ఎస్‌ఎఫ్ఐ రంగా జిల్లా కార్యదర్శి శంకర్, ఏఐఎస్‌ఎఫ్ హైద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలో వచ్చి రెండేళ్ళ కావస్తున్నా పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నరేష్, ఉదయ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం

కందుకూరు: కాంగ్రెస్ పాలనలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ నాయకులు బూనూరి నరేందర్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, మొగుల రమేశ్, మంగలి మల్లయ్య, పాపగళ్ల రవీందర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పులిమామిడిలో పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద వడ్డీలేని రుణాలు, ఉచిత గ్యాస్, విద్యుత్, రైతుభరోసా తదితర పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని కొనియాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను కూడా సునాయాసంగా చేసి చూపుతుండటం సంతోషించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, పాపగళ్ల యాదయ్య, భానూరి గంగాధర్‌రెడ్డి, వత్తుల నారాయణ, మహేందర్, శేఖర్, యాదయ్య, ప్రభుదాస్, గౌస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



పులిమామిడిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వ్యసనాలకు దూరంగా ఉండాలి

సైదాబాద్: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్‌ను అందుకుంటారని సేఫ్ ఫౌండేషన్ ప్రతినిధి జటావత్ శ్రీను అన్నారు. శనివారం ఫౌండేషన్ ప్రతినిధులు సైదాబాద్ డివిజన్ శంకేశ్వరబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదట్లో స్నేహితుల ప్రోద్బలంతో సరదాగా మొదలయ్యే వ్యసనాలు జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తాయన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండి డ్రగ్స్ రహిత సమాజ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, దివ్యరేఖ, ఫౌండేషన్ ప్రతినిధులు పావని, వల్లీ, సాహెబ్, వినయ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వరద కాలువ పనులు వేగవంతం చేయాలి



పనులు పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్ కాలనీలో ఇప్పటికే ప్రారంభించిన వరదనీటి కాలువ పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి నీట మునిగిన కాలనీల్లో శనివారం ఆయన పర్యటించి మాట్లాడారు. వరదనీటి కాలువ, రోడ్డు ఏర్పాటు పనులకు అడ్డుగా ఉన్న ఎలాంటి అక్రమ నిర్మాణాలను తొలగించి పనులు వేగవంతం చేయాలన్నారు. కాలనీల్లో అభివృద్ధి పనులు జరిగేటప్పుడు స్థానికులకు అసౌకర్యంగా ఉంటుందని సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రతాప్, అర్చన, ఏఈ సురేష్, నాయకులు రవీందర్‌రెడ్డి, దశరథగౌడ్, శ్రీధర్, శ్రీకాంత్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు జనార్ధన్‌రెడ్డి, విశ్వం, వేణు, సుధాకర్‌రెడ్డి, నరసింహ, గంగాధర్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, డీసీ సుజాత

చైతన్యపురి: బోనాల పండుగకు ఆలయాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాతతో కలిసి ఆయన వరద ప్రభావిత కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రహదారులు బ్లాక్ సిల్ట్, బురద రోడ్లపై నిలిచిపోయి వాహనదారులు, కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా రహదారులపై పేరుకుపోయిన మట్టి, రోడ్లపై పడ్డ చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని డీసీని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఐ చందన, సూపర్‌వైజర్ బుచ్చయ్య, జవాన్ సాయి, రాంకి సిబ్బంది దిలీప్, దయాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని విజయ గార్డెన్స్‌లో త్వరలో పర్యటించి కాలనీలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడ పరిధిలోని విజయగార్డెన్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం వివిధ సమస్యలపై ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో వరదనీరు పారేందుకు గతంలో నిర్మించిన డ్రైయిన్ సరిపోకపోవడంతో మురుగు ఏరులై పారుతుందని నూతన డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. వినతి ఇచ్చిన వారిలో చిరంజీవి, మోహన్, మల్లారెడ్డి, నర్సింహాచారి, రాజేశ్వర్, సూర్యనారయణరెడ్డి, అనంతశర్మ, చంద్రమౌళి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

షాద్‌నగర్‌రూరల్: రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను ఆ సంఘం సభ్యులు సందర్శించి సభ్యత్వాన్ని చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలను తట్టుకోవాలంటే ప్రతి 6 నెలలకు ఒక డీఏను ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి.. 19 నెలలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల సమ్మె కాలపు వేతనాలను విడుదల చేయాలని, వాటిల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించి మినిమం టైం స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు మార్చాలని, విద్యార్థుల సంఖ్య మాత్రమే కాకుండా మీడియంను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనియెడల టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు కృష్ణయ్య, రంగరాజన్‌కుమార్, బాలయ్య, యాదయ్య, శివకుమార్, బుద్ధదేవ్, భరత్‌కుమార్, దత్తాత్రేయ, మహేష్, సమత, జ్యోతిర్మయి, కృష్ణవేణి, పరమేశ్వరి పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు